


వీధి కుక్కలను అరికట్టాలి

కుక్కకాటు బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో వీధి కుక్కలను అరికట్టాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. పత్తేబాద్ ఏటిగట్టు, సంజయ్‌గాంధీ కాలనీల్లో వీది కుక్క 10 మంది పిల్లలను కరిచిన ఘటనలో గాయపడిన వారిని గురువారం ఆ పార్టీ నాయకులు పి.ఆదిశేషుతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో ఎక్కడ చూసినా వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. రాత్రిపూట పాదచారులు, బైక్‌లపై వెళ్తున్న వారిని వెంబడించి కరుస్తున్నాయన్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రభుత్వాసుపత్రిలో కుక్కకాటు వ్యాక్సిన్లు వేయించుకుంటున్నారన్నారు. కుక్కలను అరికట్టడంలో కార్పొరేషన్ విఫలమైందన్నారు. ఇప్పటికైనా వీధికుక్కలను నిరోధించాలని ఆయన డిమాండ్ చేశారు.

కొల్లేరు.. కలవరం..!



ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు అవగాహనా సదస్సులు

ఐదో కాంటూరు నుంచి పది కిలోమీటర్ల వరకూ ఈ జోన్

కొల్లేరు అభయారణ్యం విస్తరణకు ప్రణాళికలు

ఈ ప్రతిపాదనతో మరో 50కుపైగా గ్రామాలు కొల్లేరు పరిధిలోకి

నిడమర్రు మండలంలోని అన్ని గ్రామాలూ సరస్సులోకే

ఎకోసెన్సిటివ్ జోన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కొల్లేరు, పరిసర గ్రామాల ప్రజలు

జోన్ ఏర్పాటైతే అనేక నిబంధనలు అమల్లోకి, అభివృద్ధికి శరాఘాతం

మూడో కాంటూరుకు కుదింపునకు తిలోదకాలిచ్చి.. ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో తీవ్ర కలవరపాటు నెలకొంది. కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామంటూ నిన్నటి వరకూ వాగ్దానాలిచ్చిన ప్రభుత్వాలు.. ఏకంగా ఐదో కాంటూరు నుంచి పది కిలోమీటర్ల పరిధి వరకూ ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు ప్రయత్నించడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుపై ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ కొల్లేరు పరిసర గ్రామాల్లో నిర్వహించిన అవగాహనా సదస్సుల్లో అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటైతే మరో 50కిపైగా బెడ్ గ్రామాలు కొల్లేరు అభయారణ్య పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. అంతేకాకుండా జోన్ పరిధిలో అనేక రకాల ఆంక్షలు అమలు కానున్నాయి. రోడ్డు వేయాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. పరిశ్రమల ఏర్పాటు అనేది మచ్చుకు కూడా కన్పించదు. ఇప్పుడు సాగు చేస్తున్న భూములన్నీ కొల్లేరు పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. దీంతో కొల్లేరును ఆనుకుని ఉన్న బెడ్ గ్రామాల ప్రజలంతా తీవ్రంగా నష్టపోనున్నారు. ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడనుంది. ప్రజలకు నష్టం చేకూర్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. కొల్లేరుపై పాలకులు చెబుతున్నదేమిటీ, చేస్తున్నదేమిటీ అనే చర్చ జనాల్లో విస్తృతంగా సాగుతోంది. దాదాపు 77 వేల ఎకరాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. కొల్లేరులో దాదాపు 120 బెల్టు గ్రామాల పరిధిలో దాదాపు ఏడు లక్షల జనాభా వరకూ ఉన్నారు. వరిసాగుకు అనుకూలంగా లేకపోవడంతో గత ప్రభుత్వాలు ఒత్తిడి తెచ్చి చేపల చెరువులు తవ్వించిన పరిస్థితి ఉంది. సొసైటీలు ఏర్పాటు చేసి కొల్లేరు భూములను అక్కడి ప్రజలకు ఇచ్చి చేపల చెరువులు తవ్వించారు. 2006లో అప్పటి ప్రభుత్వం ఆపరేషన్ కొల్లేరు పేరుతో చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి మరీ ధ్వంసం చేసింది. దాదాపు పది వేల ఎకరాల్లో జిరాయితీ భూముల్లోని చెరువులను సైతం ధ్వంసం చేసి, చిల్లిగవ్వ పరిహారం కూడా ఇవ్వలేదు. దీంతో కొల్లేరు ప్రజలు ఉపాధి కోల్పోయి వలస పక్షుల్లా రోడ్డున పడ్డారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ఇక్కడి ప్రజలకు న్యాయం చేయాలంటూ ప్రజలు కోరడంతో ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ హామీలిచ్చాయి. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది.

పత్తాలేని మూడో కాంటూరుకు కుదింపు హామీ

2014 ఎన్నికల సందర్భంగా భీమవరంలో జరిగిన సభలో ప్రస్తుత ప్రధాని మోడీ మాట్లాడుతూ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, ఇక్కడి ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగినట్లుగానే రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. ఈ తీర్మానానికి వైసిపి సైతం ఆమోదం తెలిపింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తే దాదాపు 35 వేల ఎకరాల్లో కొల్లేరు సరస్సు ఉంటుంది. దీంతో మరో 35 వేల ఎకరాలు కొల్లేరు నుంచి బయటపడుతుంది. దీంతో ఇక్కడి ప్రజలకు ఉపాధికి ఇబ్బంది లేకుండా ఉంటుందని అప్పట్లో లెక్కలు వేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తే దాదాపు 22 వేల ఎకరాలు రైతులకిచ్చే అవకాశం ఉందని టిడిపి ప్రభుత్వ హయాంలో అంచనా వేశారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో కొల్లేరును అభివృద్ధి చేస్తామని, పూర్వవైభవం తెస్తామంటూ వైసిపి సైతం హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా కొల్లేరు గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరును మరింత విస్తరించి అక్కడి ప్రజలకు నష్టం చేకూర్చేవిధంగా అడుగులు వేస్తున్న పరిస్థితి ఉంది. కొల్లేరును ఆనుకుని ఉన్న మండలాలు ఏలూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, దెందులూరు, పెదపాడు, కైకలూరు, మండవల్లి, ఆకివీడుల్లో ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు సంబంధించి అవగాహనా సదస్సులు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు మినహా ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు గురువారంతో పూర్తయ్యాయి.

నిడమర్రు మండలం పూర్తిగా కొల్లేరులోకే..

ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటైతే నిడమర్రు మండలంలో ఉన్న బువ్వనపల్లి, అడవికొలను వంటి గ్రామాలతోపాటు మండలంలోని మొత్తం 24 గ్రామాలు కొల్లేరు అభయారణ్య పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలంలో తల్లాపురం, కైకరం గ్రామాలు, భీమడోలు మండలంలో మల్లవరం, చెట్టున్నపాడు, ఆగడాలలంక, గుండుగొలను, భీమడోలు, అంబరుపేట రెవెన్యూ గ్రామాలు, మండవల్లి మండలంలో ఏడు గ్రామాలు, పెదపాడు మండలంలో సత్యవోలు, వడ్డిగూడెం, పెదపాడు, కొణికి, వీరమ్మకుంట, ముప్పర్రు వంటి గ్రామాలు, కైకలూరు మండలంలో కొట్టాడ, పెంచులమర్రు, ఆలపాడు, సోమేశ్వరం, భుజబలపట్నం, దొడ్డిపట్ల, రామవరం, ఆటపాక గ్రామాలు, దెందులూరు మండలంలో పోతునూరు, దోసపాడు, కొవ్వలి వంటి గ్రామాలు ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి వెళ్లిపోనున్నాయి. ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటైతే ఇక ఆయా గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోనుంది. రోడ్లు, పరిశ్రమలు ఏర్పాటు వంటి ఏఒక్కటీ చేసే అవకాశం ఉండదు. ఎకోసెన్సిటివ్ జోన్‌ను వైసిపి ప్రజాప్రతినిధులే తీవ్రంగా వ్యతిరేకించారు. ఎకోసెన్సిటివ్ ఏర్పాటు ప్రతిపాదనలపై జనాల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఎకోసెన్సిటివ్ జోన్ దేనికో స్పష్టం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి



ఏలూరు అర్బన్: కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్ ఎందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నూజివీడు సభలో స్పష్టం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎకోసెన్సిటివ్ జోన్‌గా గుర్తింపు కోసం జరుపుతున్న గ్రామ సభల అసలు ఉద్దేశం ఏమిటో వెల్లడించాలని కోరారు. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాలకు చెందిన 8 మండలాల్లో తూతూమంత్రంగానే గ్రామసభలు నిర్వహించారని, ఈ సభలు కూడా కొద్దిమందితో రహస్య సమావేశాలుగా జరిపారని ఆరోపించారు. ఈ సభల్లో ప్రజల నుండి వస్తున్న విన్నపాలను రాసుకుని, అధికారులు చెప్పాల్సింది మాత్రం గట్టిగా చెప్పి వెళ్లిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొల్లేరు ప్రజలంతా మూడో కాంటూరుకు కుదించాలని కోరుతుంటే, దీనికి విరుద్ధంగా ఐదో కాంటూరుకు పైబడి పది కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్‌గా గుర్తించడం ఏమిటని ఆయన నిలదీశారు. ఇప్పటికే కొల్లేరు ప్రజలు తమ ఉపాధి కోల్పోయి, ఆర్థికంగా దెబ్బతిని, వలసలు పోతున్నారని, ఈ తరుణంలో జోన్ విస్తరణతో సమస్య మరింత తీవ్రమవుతుందని స్పష్టం చేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని 2014 ఎన్నికల్లో మోడీ, వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారని, అదేవిధంగా 2018లో రాష్ట్ర అసెంబ్లీలో రెండుసార్లు తీర్మానం చేశారని గుర్తు చేశారు. మోడీ, వెంకయ్య నాయుడు ఇచ్చిన హామీకి, జగన్మోహన్‌రెడ్డి ఆమోదంతో చేసిన అసెంబ్లీ తీర్మానాలకు భిన్నంగా ఈ గ్రామ సభలు నిర్వహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాలుష్య నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, కొల్లేరు ప్రజల జీవితాలతో ఆటలు ఆడరాదని కోరారు. కొల్లేరు ప్రజలు కోరుకుంటున్నట్లుగా మూడో కాంటూరుకు కుదించాలని, మూడో కాంటూరు పైబడి ఉన్న ప్రభుత్వ భూములు 22 వేల ఎకరాలు ప్రజలకు పంచాలని, కొల్లేరు ప్రజలకు ఉపాధి చూపాలని రవి డిమాండ్ చేశారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నేడు సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి సర్వం సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీ శుక్రవారం నాడు సిఎం నూజివీడులో పర్యటించనున్నారు. 2003కు ముందు అసైన్డ్ భూములకు హక్కు కల్పించడం, అసైన్డ్ భూములకు కొత్త పట్టాల పంపిణీ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత నూజివీడు-విస్సన్నపేట ప్రధాన రహదారిలోని జగనన్న టౌన్‌షిప్ స్థలంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మైలవరం రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను వారు పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి చేరుకునే రహదారిలో తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, తదితర శాఖల అధికారులతో వారు సమీక్షించారు. సిఎం పాల్గొనే కార్యక్రమానికి హజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సిట్టింగ్, తాగునీరు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ, డిఎస్‌పి ఇ.అశోక్‌కుమార్ గౌడ్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, నూజివీడు తహశీల్దారు ఎల్లారావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఆశ, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎన్‌వి.సత్యనారాయణ ఉన్నారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలించి అదనపు సిసిఎల్‌ఎ

జిల్లాలోని నూజివీడులో అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాక సందర్భంగా ఆయన పర్యటన ఏర్పాట్లను అదనపు సిసిఎల్ఎ ఎమ్‌డి.ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలితో కలిసి పరిశీలించారు. అనంతరం నూజివీడు సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో సమావేశమై సిఎం పర్యటన సందర్భంగా సంబంధిత అంశాలపై చర్చించారు.

సిఎం పర్యటన సాగేదిలా

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడులో పర్యటించనున్నారు. ఉదయం 9.55 గంటలకు తాడేపల్లిలోని హెలిప్యాడ్ నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.25 గంటలకు నూజివీడులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకుంటారు. అక్కడే 10.35 గంటల వరకు పలువురు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం ఉదయం 10.55 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. అనంతరం ఫ్రీ హోల్డింగ్ ఆఫ్ అసైన్‌మెంట్ ల్యాండ్ పట్టాలను, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి లబ్ధిదారులకు అందజేసే సభా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.35 గంటలకు సభా ప్రాంగణం నుండి బయలుదేరి 12.50 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.50 నుండి మధ్యాహ్నం 1.50 గంటల వరకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1.55 గంటలకు నూజివీడు హెలీపాడ్ నుండి తాడేపల్లి బయల్దేరి వెళ్తారు.



రైతులతో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఆర్‌బికె నిర్ధారించిన తేమశాతమే ఫైనల్

ఉంగుటూరు ఆర్‌బికెను సందర్శించిన సివిల్ సప్లయీస్ కమిషనర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆర్‌బికె వద్ద నిర్ధారించిన తేమ శాతమే ఫైనల్ అని సివిల్ సప్లయీస్ కమిషనర్ సిహెచ్.అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక రైతుభరోసా కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ధాన్యం సేకరణలో సమస్యలపై రైతులతో ఆయన చర్చించారు. కొనుగోలు కేంద్రంలో తేమశాతం 16 ఉంటే, రైసుమిల్లు వద్ద 19 శాతం ఉందంటున్నారని పలువురు రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుభరోసా కేంద్రాల వద్ద కొలిచిన తేమశాతమే ఫైనల్ అని, దీనిపై విచారణ చేయిస్తామని కమిషనర్ రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు మేలు చేసేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని ఆయన వివరించారు. ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ డివైజ్ అమరిక, సాంకేతిక సమస్యల కారణంగా ట్రక్ షీట్ జనరేట్ కావడం లేదని రైతులు చెప్పారు. ఉంగుటూరు మండలంలో ప్రస్తుతానికి ఎనిమిది వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయి ఇప్పటి వరకూ రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపించామని ఆర్‌బికె సిబ్బంది వివరించారు. నాచుగుంట, రావులపర్రు మిల్లులకు ధాన్యం తోలిన లారీ రోజులు తరబడి దిగుమతి కోసం ఉండిపోతున్నాయన్నారు. అనంతరం నాచుగుంటలో గాయత్రి రైస్‌మిల్లును కమిషనర్ సందర్శించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

కొల్లేరు పరిధి పెంపు యోచన సరికాదు

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరులో కాలుష్యం, ఆక్రమణలను అడ్డుకోకుండా కొల్లేరు పరిధిని పది కిలోమీటర్లు పెంచడానికి ప్రజాభిప్రాయ సేకరణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సమంజసం కాదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ ప్రాంతంపై ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 11 గంటల వరకు ప్రజలు ఎవరూ హాజరు కాలేదు. దీంతో ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ జయప్రకాష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే కొల్లేరును కాలుష్యం బారి నుండి పరిరక్షించేలా సరిహద్దు నుండి పది కిలోమీటర్ల మేర సెన్సిటివ్ ప్రాంతంగా ప్రకటించడానికి అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగానే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిపై భాస్కరరావు స్పందిస్తూ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సులో కాలుష్యం, ఆక్రమణలు పెరిగిపోవడానికి కారకులు మీరు కాదా అని ప్రశ్నించారు. కొల్లేరులో రెగ్యులేటర్ నిర్మాణం, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి ఏమైందని నిలదీశారు. మణుగూరు వద్ద సుమారు 500 ఎకరాలు పైబడి కొల్లేరు అభయారణ్యంలో నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల చెరువులు తవ్వితే మీరేం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. అనుమతులతోనే కొల్లేరులో తవ్వకాలు చేశారని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ జయప్రకాష్ చెప్పడం దారుణమన్నారు. ప్లస్ 5 కాంటూరుగానే ఉంచి ప్రజల జీవన స్థితిగతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, కొల్లేరు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్‌కుమార్, ఎంపిడిఒ వెంకటరమణ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కరరావు



సాంబశివరావుకు ఎన్నిక ధ్రువీకరణపత్రం అందిస్తున్న ప్రముఖులు

నారాయణపురం ఉప సర్పంచిగా సాంబశివరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఉప సర్పంచిగా నాలుగో వార్డు సభ్యుడు మరడ సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు రిటర్నింగ్ అధికారి, ఇఒపిఆర్‌డి షేక్ షంషుద్ధీన్ వెల్లడించారు. గురు వారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నికకు సర్పంచి తోపాటు 13 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. ఉపసర్పంచి అభ్యర్థిగా సాంబశివరావు పేరును ఎనిమిదో వార్డు సభ్యుడు అడపా శ్రీనివాసరావు ప్రతిపాదించగా ఆరో వార్డు సభ్యుడు నేదూరి గంగాధరరావు బలపరిచారు. సర్పంచితోపాటు మిగిలిన సభ్యులంతా చేతులెత్తి సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి ఎన్నిక ధ్రువీకరణపత్రాన్ని సాంబశివరావుకు అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న పాలకవర్గానికి ఉప సర్పంచి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. ఇప్పటి వరకూ ఉపసర్పంచిగా సేవలందించిన అడపా శ్రీనివాసరావును సభ అభినందించింది. సర్పంచి దిడ్ల అలకనందదేవి, వార్డు సభ్యులు తోట కరుణకుమారి, మరపట్ల పెద్దింట్లు, కిలపర్తి లక్ష్మి, పైడి వెంకటలక్ష్మి, లావేటి కోమలి, నేకూరి ఆశీర్వాదం, లోక్ వినోద్, మతుకుమిల్లి వెంకటేశ్వరరావు, పరిమి అరుణకుమారి, అత్తులూరి గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి జవ్వాది నాగేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు, సచివాలయం కన్వీనర్ సీపాని బాలు, పార్టీ అధ్యక్షుడు పైడి అరుణ్‌కుమార్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముసునూరు ఎంపిపిగా దుర్గాభవాని

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ఎంపిపిగా కొండా దుర్గాభవాని ఎన్నికైనట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి అధ్యక్షతన మండలంలోని 16 గ్రామాల ఎంపిటిసిలతో ఎంపిపి ఎన్నిక నిర్వహించారు. రమణక్కపేట ఎంపిటిసి కొండా దుర్గాభవానిని ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంతో ఆమె ఎంపిపిగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధర్‌రావు, కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు, వైసిపి మండలాధ్యక్షులు మూల్పురి నాగమల్లేశ్వరరావు, సర్పంచులు చలసాని దామోదర్‌రావు, పేరం కృష్ణ, రంగు ధనలక్ష్మిగాంధీ, రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, పిల్లి సత్యనారాయణ, ఎంపిటిసిలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు



దుర్గాభవానిని సత్కరించిన ప్రజాప్రతినిధులు

కృష్ణా జలాల గెజిట్ ఉపసంహరించాలి: సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే పద్ధతుల్లో కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఉందని, తక్షణమే దాన్ని ఉపసంహరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిరసన దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. నీరు సమృద్ధిగా ఉన్నా కాలువల ఆధునికీకరణ లేకపోవడంతో సాగునీరు సరఫరా సరిగా లేదన్నారు. రాష్ట్రంలో 440 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103 మండలాలను ప్రకటించిందని విమర్శించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు కరువుపై నోరు మెదపకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం కరువు మండలాలను తక్షణమే ప్రకటించాలన్నారు. ఈ నెల 20, 21వ తేదీలలో సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే 30 గంటల దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, నేతలు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, కె.కృష్ణమాచార్యులు, శ్యామల కుమారి పాల్గొన్నారు.

ఆదర్శనీయులు వాసుదేవ్‌ఆచార్య, శంకరయ్య


సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం సీనియర్ నేతలు వాసుదేవ్‌ఆచార్య, శంకరయ్య ఆదర్శనీయులని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. వారి మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. ఆ నాయకుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం వాసుదేవ్‌ఆచార్య, శంకరయ్య సంతాప సభ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఇరువురి చిత్రపటాలకు జిల్లా కార్యదర్శి రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వాసుదేవ్ ఆచార్య పార్టీ పార్లమెంటరీ నాయకుడిగా, ట్రేడ్ యూనియన్ నేతగా దేశానికి విశేష సేవలందిచారన్నారు. రైల్వే కార్మికులను ఆర్గనైజ్ చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. రైల్వే ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. బెంగాల్లో ఉగ్రవాదులను ఎదుర్కోవడంలో ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. పార్టీ మీద భౌతికంగా, సిద్ధాంతపరంగా జరుగుతున్న దాడులను తిప్పికొట్టడంలో ముందువరుసలో ఉండేవారని చెప్పారు. సిపిఎం సీనియర్ నేత, స్వాతంత్ర సమరయోధుడు శంకరయ్య మూడుసార్లు ఎంఎల్‌ఎగా తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికయ్యారన్నారు. తమిళనాడు సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారన్నారు. 20 ఏళ్ల వయస్సులోనే స్వాతంత్రోద్యమంలోకి వచ్చారన్నారు. 18 మాసాలు జైలు శిక్ష అనుభవించారని తెలిపారు. 95 ఏళ్ల వయస్సులోనూ కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా సాగిన ఆందోళనల్లో పాల్గొన్నారన్నారు. ఈ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సిపిఎం నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, నాయకులు, బి.జగన్నాధరావు, పి.ఆదిశేషు, కనకారావు, కృష్ణారావు, కోటేశ్వరరావు, గోపీ, సత్యం తదితరులు పాల్గొన్నారు.



వాసుదేవ్‌ఆచార్య, శంకరయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రవి


మాట్లాడుతున్న మాగంటి బాబు

'మకుటం లేని మహారాజు ఎన్‌టిఆర్'

ముసునూరు : ఎన్‌టిఆర్ మకుటం లేని మహారాజు అని ఏలూరు ఎంపీ మాగంటి బాబు, నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని సూరేపల్లిలో నాలుగు రోడ్ల ప్రధాన కూడలి వద్ద ఎన్టీఆర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం టిడిపి నాయకులు పర్వతనేని గంగాధరరావు అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి చేయూతనిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, మల్లిబాబు, గద్దల మోహనరావు, సూర్యదేవర నాగమంజల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంగారావు ఆశయ సాధనకు కృషి

ఏలూరు : సిపిఎం సీనియర్ నాయకులు తన్నీరు రంగారావు ఆశయసాధనకు కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళులని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం ఉదయం స్థానిక చోడిదిబ్బ యువజన సంఘం గ్రంథాలయంలో రంగారావు ప్రథమ వర్ధంతి అల్లం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు, సుందరయ్య గ్రంథాలయ నిర్వాహకులు కండి విశ్వనాథం పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ రంగారావు నిబద్ధత కలిగిన నాయకుడని తెలిపారు. ఆదిశేషు మాట్లాడుతూ ప్రెస్ వర్కర్‌గా జీవితాన్ని ప్రారంభించిన రంగారావు చనిపోయే వరకు జాబు కార్మికుడిగా పని చేశారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోమయ్య మాట్లాడుతూ చోడిదిబ్బ ప్రాంతంలో పార్టీ ఉనికి కోసం తన వంతు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బివి సింహాచలం, పప్పు జగన్నాథ రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు జాయింట్ అక్కౌంట్ తప్పనిసరి

ఏలూరు : ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకం ద్వారా అందజేసే తదుపరి వాయిదా సొమ్ముకు సంబంధించి విద్యార్థులందరూ తల్లి లేదా తండ్రితో జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎన్.నాగరాణి తెలిపారు. ఈనెల 24వ తేదీలోపే చేయవల్సిందిగా ఆమె తెలియజేశారు. వివిధ కోర్సుల్లో చివరి సంవత్సరము చదువుతున్న విద్యార్థులు, ఎస్‌సి విద్యార్థుల మినహా మిగిలిన విద్యార్థులందరూ తప్పనిసరిగా జాయింట్ ఖాతాను ప్రారంభించాలన్నారు. జాయింట్ ఖాతా ఏ బ్యాంక్‌లోనైనా తెరవవచ్చన్నారు. కొత్త జాయింట్ ఖాతాను తెరిచిన తర్వాత పాస్‌బుక్‌ను అప్‌డేట్ చేయించి, నవశకం పోర్టల్‌లో కొత్త జాయింట్ ఖాతా వివరాలను నమోదు చేయడానికి పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీని గ్రామ సెక్రెటేరియట్‌లో అందజేయవలెనన్నారు.

కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు

చాట్రాయి : పురుగుమందులు వేయకుండా పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలని మండల తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సిబ్బంది కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. తహశీల్దార్ వీటిని పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువులు వాడకుండా ఎలాంటి కూరగాయలు పండించడం లేదన్నారు. ఆ కూరగాయల వలన ప్రజలు అనారోగ్య పాలవుతున్నారన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడని సేంద్రియ ఎరువులు వాడుతూ పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలని, ప్రజలందరూ వీటినే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, సుజాత, వినీల, సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండిస్తున్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంటసామగ్రి అందజేత

చింతలపూడి : జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు మంచి పౌష్టికాహారం ఇవ్వడమే కాకుండా వంటలు చేసే పాత్రలు కూడా నాణ్యమైన ఎస్‌ఎస్ మెటీరియల్‌తో తయారుచేసినవి సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్ని పాఠశాలలకు అందిస్తున్నారని చింతలపూడి ఎంపిపి రాంబాబు తెలిపారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రభుత్వ వారిచే పంపించే వంటసామగ్రిని వంట పాత్రలను ఎంపియుపి పాఠశాలలో సర్పంచి కె.శివ రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరుకుళ్ళ సుబ్బారావు, డా.వెంకటప్పయ్య, విద్యా కమిటీ ఛైర్మన్ నరుకుళ్ళ పార్వతి, హెచ్‌ఎం ఎస్ఎస్.రాజేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనంద్ మృతి తీరని లోటు

మండవల్లి : గ్రామ ప్రముఖులు, మాజీ ఉపసర్పంచి గుడివాడ వెంకటేశ్వరరావు(ఆనంద్) మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. కుటుంబీకుల సందర్శనార్థం మండవల్లిలోని ఆయన నివాసంలో పార్థీవదేహాన్ని ఉంచగా ఎంఎల్ఎ సందర్శించి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, బిసి నాయకులు బేతోజు వీర్రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు గోకర్ణ యాదవ్, గుడివాడ మురళీ, బాబి, ప్రసాద్, సత్యంబాబు, మహేష్, మేస్త్రీ, బాబి, మెండ సురేష్ నివాళులర్పించారు.

ప్రతి ఇంటికీ తాగునీరందించడమే లక్ష్యం

ఉంగుటూరు : గోపీనాథపట్నం గ్రామ సచివాలయం వద్ద జల్ జీవన్ మిషన్ గ్రామసభ సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ప్రతి ఇంటికి రక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తుందని సర్పంచి పేర్కొన్నారు. గ్రామాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జల జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' లఘు నాటిక ప్రదర్శన

ఏలూరు టౌన్ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఏలూరు తంగెళ్లమూడిలోని ఆంధ్రభక్త గోపాలకృష్ణయ్య నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' అనే అంశంపై సందేశాత్మక లఘు చిత్ర నాటక ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిబిఐ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.రజిత, హెచ్‌ఎం డిఎస్. ఉజ్వల పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఎక్సైజ్ పోలీసునంటూ బెదిరించిన వ్యక్తి అరెస్ట్

కలిదిండి : ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పోలీసునంటూ ఓ వ్యక్తి నుంచి డబ్బు వసూలు చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొండంగి పంచాయతీ యడవల్లి గ్రామానికి చెందిన కోకా కృష్ణకు ఓ వ్యక్తి ఫోన్ చేసి నువ్వు గుర్వాయిపాలెం వైన్ షాప్‌లో మందు బాటిల్స్ కొనుగోలు చేశావని, నీపై కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.5 వేలు ఇవ్వాలని బెదిరించాడు. కలిదిండి గ్రామానికి చెందిన వలవల అజయ్ కుమార్‌గా వ్యక్తిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ప్రియ కుమార్ తెలిపారు.

కన్నతల్లిని హతమార్చిన కొడుకు

జీలుగుమిల్లి : రాచన్నగూడెంలో మంగళవారం ఉదయం చెరువు గట్టు మీద మహిళను చంపి పడేసిన ఘటనను పోలీసులు చేధించారు. ఈ హత్య కేసులో అనసూయ(70)ను కన్నకొడుకు శ్రీను హత్య చేసినట్లు గుర్తించి అతనిని అరెస్ట్ చేసినట్లు గురువారం సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇద్దరి వారికి ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం జరుగుతున్న నేపథ్యంలో గొంతు నొక్కి ఊపిరాడకుండా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై పెట్టుకొని గ్రామంలోని చెరువు గట్టు మీద పడేశాడు. ఈ సంఘటనపై ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై శ్రీనును అరెస్టు చేసినట్లు తెలిపారు.

2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : జిల్లాలో డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కలిగించేందుకు ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. ఇపి, జనరల్ రేషియోలో వ్యత్యాసం లేకుండా పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఖచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితా తయారీకి సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, జెడ్పి సిఇఒ కెఎస్-ఎస్.సుబ్బారావు, కైకలూరు ఆర్డిఒ కె.వెబ్బి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పోలవరం : మండలంలోని కొత్తపట్టిసీమ పంచాయతీ జిల్లా పరిషత్ రోడ్డులో సిసి రోడ్లు, రాజుగట్టు చెరువు, కొవ్వాడ కాలువ క్రాసింగ్ వద్ద కాజ్‌వే నిర్మాణ పనులకు రూ.30 లక్షలతో విలువైన పనులకు పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్త పట్టిసీమ గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్టిసీమ సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిటిసి వలవల వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దత్తి రాంబాబు, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, కొత్త పట్టిసీమ సొసైటి అధ్యక్షులు అడ్డగర్ల సాయిబాబా పాల్గొన్నారు.

వినియోగదారుల కోసం 'ఆసరా' కృషి

ఏలూరు : వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు ఆసరా సంస్థ కృషి చేస్తుందని జిల్లా ఆసరా సంస్థ అధ్యక్షులు కొడాలి రమేష్ బాబు అన్నారు. ఈనెల 24న ఢిల్లీలో జరగనున్న ఐదవ నేషనల్ సమ్మిట్ జాతీయస్థాయి కన్జ్యూమర్స్ అవేర్నెస్ ప్రోగ్రాంకు పశ్చిమగోదావరి జిల్లా ఆసరా సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. బుధవారం స్థానిక ఆంగ్లో ఇండియన్ కాన్వెంట్లో నిర్వహించిన ఆసరా సంస్థ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఎపిజె జాతీయ సభ్యులు దూసనపూడి సోమ సుందరంతో కలిసి నేషనల్ సమ్మిట్ బ్రోచర్‌ను ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసరా కార్యవర్గ సభ్యులు ఎన్.సత్తిబాబు, ఆదిత్య కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిజం ప్రముఖమైనది : సిఐ

చింతలపూడి : సమాజంలో జర్నలిజం అనేది ప్రముఖమైనదని, గ్రామీణ స్థాయిలో సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేది జర్నలిస్టులేనని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు తెలిపారు. మండలంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద జాతీయ పత్రిక దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జర్నలిజం అంటే ఫ్యాషన్‌తో వచ్చేవారు, ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని వాటిని మార్చి సమస్యలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఆజాద్, స్వర్ణపతక గ్రహీత మల్లెల జయరాజు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : గ్రంథాలయం వారోత్సవాలు సందర్భంగా గురువారం ఉంగుటూరులో జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించారు. ఉంగుటూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముప్పన భుజంగరావు మాట్లాడుతూ పత్రికా పఠనాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు చిట్టూరి గంగాధర్ రావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి పివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు శ్రీనివాస్ ఎంపిక

చింతలపూడి : భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారు ప్రధానం చేసే బాబా సాహెబ్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు 2023 సంవత్సరానికి ఎంపికైనట్లు జివిఎస్.శ్రీనివాస్ తెలిపారు. మండలానికి చెందిన శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా, ఉద్యోగసంఘం నాయకులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయన చేసిన సామాజిక సేవ, ఉద్యోగుల సమస్యలపై సామాజిక కార్యక్రమాల ద్వారా చేసిన కృషికి గాను ఈ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అవార్డు డిసెంబర్ 10, 11వ తేదీల్లో ఢిల్లీలో ప్రధానం చేస్తారని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : జెడ్‌పిటిసి

టి.నరసాపురం : గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అధికారులకు ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో నిర్మాణంలో గృహాలు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బివిఎస్ఎల్ మంగా కుమారి, తహశీల్దార్ జెవి.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌ల పంపిణీ

ముదినేపల్లి : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పూర్వ విద్యార్థులకు గురువారం ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.37 వేల విలువ గల ల్యాప్ ట్యాప్‌లను ఏడుగురు విద్యార్థులకు అందజేశారు. జెడ్‌పి హైస్కూల్లో 2023 మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 పైబడి మార్కులు సాధించి, ప్రభుత్వ పాఠశాలలో మండల ప్రథమంగా పామర్తి వివేక్ నిలిచాడు. ఇదే పాఠశాలలకు చెంది 500 పైబడి మార్కులు సాధించిన కె.మెర్సీ రూతు, మరీదు గీతిక, కె.శ్రీవల్లి, ఎం.లోహిత్, పి.చందు, ఎస్.లోహిత్, సుమంత్‌లకు పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్నారై దొడ్డపనేని బాబురావు, ప్రసూన దంపతులు అందజేసిన ల్యాప్‌టాప్‌లను బాబురావు మేనకోడలు, నిర్భయ క్రాంతి మహిళా మండలి ప్రెసిడెంట్ అబూరి రత్న లక్ష్మి చేతులు మీదుగా ప్రతిభ విద్యార్థులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి, వడాలి హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

ఏలూరు టౌన్ : మహిళా సాధికారతే లక్ష్యమని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల కుమారి, మన్నవ యామిని తెలిపారు. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో శ్యామల కుమారి మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు కొండేటి బేబి, కార్యనిర్వాహక కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, ఉపాధ్యక్షురాలు విజయ పాల్గొన్నారు.

అటవీ సవరణ చట్టం రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం : పర్యావరణాన్ని విధ్వంసం చేసే అటవీ సంరక్షణ చట్టం - 2023ని రద్దు చేయాలని పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం అటవీ సంరక్షణ సవరణ చట్టం - 2023ని వ్యతిరేకిస్తూ పిడిఎస్‌ఒ - ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని తల్లాడి సత్తిపండు గౌడ సంఘం హాల్లో ఆదివాసి విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఈ చట్టాల వల్ల పర్యావరణం దెబ్బతినడమే కాకుండా గిరిజన విద్యార్థుల చదువుకు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు పాల్గొన్నారు.

నాగుల చవితికి ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి : జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానములో నాగులచవితికి భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి నేల సంధ్య గురువారం తెలిపారు.

'ఎల్‌ఐసి కోసం అహర్నిశలు శ్రమించారు'


వాసుదేవ్ ఆచార్యకు నివాళులర్పిస్తున్న రవికిషోర్

ఏలూరు అర్బన్ : వాసుదేవ్ ఆచార్య ఎల్‌ఐసి సంస్థ కోసం అహర్నిశలు శ్రమించారని ఎల్‌ఐసి ఆలిండియా ఏజెంట్స్ ఆర్గనైజేషన్ స్టేట్ సెక్రటరీ జి.రవి కిషోర్ తెలిపారు. ఎల్‌ఐసి వ్యవస్థాపక అధ్యక్షులు, సిఐటియు జాతీయ నాయకులు వాసుదేవ్ ఆచార్య సంతాపసభ ఏలూరు బ్రాంచ్ ఆఫీస్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రాంచ్ అధ్యక్షులు పి.శ్రీరాంప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఏజెంట్స్ కోసం దేశవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆర్గనైజేషన్ స్థాపించారన్నారు. సుదీర్ఘకాలం ఆయన ఏజెంట్స్ కోసం పోరాడారన్నారు. కేంద్ర ప్రభుత్వం సంస్థను ప్రయివేటీకరణ చేయాలని చూస్తే, వాసుదేవ్ ఆచార్య పార్లమెంట్‌లో దాన్ని అడ్డుకోవడం కోసం అనేక పోరాటాలు రూపొందించారన్నారు. ఆయన మృతి ఆర్గనైజేషన్‌కు తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వైఎస్.కనకారావు, ఆల్ ఇండియా కౌన్సెల్ సభ్యులు డివి.రామకృష్ణ, జోనల్ ఇసి మెంబర్ బి.రామ్మోహన్‌రావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాలకు రావడం అలవర్చుకోవాలని, గ్రంథాలయంలో సభ్యత్వాన్ని పొందాలని, నిరంతర అధ్యయనం ద్వారా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల కార్యదర్శి ఎం.శేఖర్ కోరారు. ఏలూరులోని బాలల గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులైన డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాల వేసి ఆయన నివాళు లర్పించారు. అనంతరం జిల్లెల్లమూడి వరప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సమాజంలో గ్రంథాలయాల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.

ఏలూరు టౌన్ : పెదపాడు శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేసిన గ్రంథాలయ పితామహులు, కీర్తిశేషులు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా పెదపాడు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ జి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, కాలేజీ లైబ్రేరియన్ నాయుడు, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం వేల్పుల ప్రభాకర్, శ్రీకృష్ణ గురుకులం స్కూల్ ఉపాధ్యాయుడు శేటికం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం 6, 7 తరగతుల వారికి 'గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు'పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

భీమడోలు : మండలంలోని మూడు శాఖా గ్రంథాలయాల్లో కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో మూడవ రోజుకు చేరుకున్నాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖ గ్రంథాలయాల్లో గంథ పాలకులు కె.శ్రీనివాసరావు, జి.నాగమణి, డిఎన్‌బి.అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి, గ్రంథాలయ పితామహులుగా గుర్తింపు పొందిన అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు పూలమాల వేసి సత్కరించారు. అనంతరం భీమడోలులో కొనసాగిన కార్యక్రమాల్లో భాగంగా చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, గుండుగొలనులో గ్రంథాలయ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పూళ్ల శాఖ గ్రంథాలయంలో క్విజ్ పోటీలను నిర్వహించారు.

ముసునూరు : ముసునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో గంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్.రంగనాధన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య లాంటి ప్రముఖులను స్మరిస్తూ, వారి జీవిత చరిత్ర విషయాలపై వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు, ఉపన్యాస్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్.పాఠశాల, భారతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సెల్ ఫోన్ వినియోగం వద్దు - పుస్తక పఠనమే ముద్దు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, వ్యాయామ ఉపాధ్యాయులు జి.మావుల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చాట్రాయి : గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీ పరీక్షలు నిర్వహించారు. ముందుగా అయ్యంకి రమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిఎం పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వికాస్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు ఆసక్తికరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు రాజశేఖర్, బ్రహ్మాజీ, విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయాధికారి పి.దుర్గారావు తెలిపారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : ఎంఎల్ఎ

ఏలూరు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ ఆళ్ల నాని అధికారులను ఆదేశించారు. 11వ డివిజన్ 47వ సచివాలయ పరిధిలో ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన గురువారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. అర్హత కలిగి ఉండి కూడా పథకాలు అందని వారికి సంబంధిత సాంకేతిక సమస్యలను సరిచేసి, పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సుమారు రూ.50 లక్షల విలువైన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోయ సత్తిబాబు, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, డిప్యూటీ మేయర్‌లు ఎన్.సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, వైసిపి జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కమిషనర్ వెంకటకృష్ణ, పిఒ కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులు స్ఫూర్తితో మెలగాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. బాలయేసు యువజన యూత్ ఆధ్వర్యంలో మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో రవీంద్ర మెమోరియల్ వర్సెస్ చింతలచెరువు జట్ల మధ్య రసవత్తరంగా జరిగిన ఈ పోటీలో చింతలచెరువు జట్టు గెలుపొందింది. విన్నర్ జట్టుకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, ట్రోఫీని ఎంపిపి సత్యనారాయణ వైసిపి నాయకులతో కలిసి జట్టు సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కులగణనపై నేడు, రేపు సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన 2023 కార్యక్రమంలో భాగంగా రీజనల్ లెవల్ రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 17న మధ్యాహ్నం 3 గంటలకు మంజీర సరోవర్, రాజమహేంద్రవరం, 18న ఉదయం 10 గంటలకు జిల్లా లెవెల్ మీటింగ్ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఏలూరులో నిర్వహిస్తున్నట్లు సాధికారిత అధికారి ఏలూరు ఆర్‌వి.నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన ఛైర్‌పర్సన్స్, డైరెక్టర్స్, వెల్ఫేర్ కార్పొరేషన్ పాల్గొనవల్సిందిగా కోరారు.

కోండ్రుకోట పంచాయతీలో 'వై ఎపి నీడ్స్ జగన్'

పోలవరం : కోండ్రుకోట పంచాయతీ పరిధిలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పైదా నాగరాజు, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, మండల సచివాలయం కన్వీనర్ మాదేపల్లి సాయికృష్ణ, ఫాతిమా మునిషా, ఐటిడిఎస్ ఛైర్మన్ అనిల్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని దేవపూర్ గ్రామంలో గురువారం 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైసిపి శ్రేణులు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఎంఎల్ఎ తనయులు దూలం వీర శ్యామ్ ఫణి కుమార్ పాల్గొన్నారు.

పట్టిసీమ శివ క్షేత్రానికి కంప్యూటర్ అందజేత

పోలవరం : పట్టిసీమపై వేంచేసియున్న శ్రీభద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారి దేవస్థానమునకు గూటాల కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పి.పవన్ కుమార్ గురువారం కంప్యూటర్ అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సంగమేశ్వరశర్మ తెలిపారు. ఆలయం వద్ద కంప్యూటర్ అందజేయడానికి విచ్చేసిన పవన్ కుమార్ తొలుత శ్రీభద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారిని దర్శించుకుని, అనంతరం కంప్యూటర్ బహూకరించారు. ఆయనను ఆలయ మర్యాదలతో గౌరవించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటరాజు పాల్గొన్నారు.

వైద్యశాఖలో పోస్టులకు కౌన్సెలింగ్

ఏలూరు టౌన్ : జిల్లా వైద్య శాఖలో వివిధ ఆసుపత్రుల్లో పనిచేసేందుకు అవసరమైన వైద్యుల నియామకానికి గురువారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 14 పోస్టులకు గతంలో నోటిఫికేషన్ ఇవ్వగా, 37 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 15 మంది కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని ఎఒ ప్రజాశక్తికి తెలిపారు.

జగన్ పాలన అంతమే తమ లక్ష్యం

సమన్వయ కమిటీ సమావేశంలో టిడిపి, జనసేన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రాభివృద్ధిని ధ్వంసం చేసి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన సైకో జగన్ పాలన అంతమే తమ అంతిమ లక్ష్యం అని టిడిపి ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ బండేటి చంటి, జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు స్పష్టం చేశారు. టిడిపి, జనసేన పార్టీల సమన్వకమిటీ సమావేశం జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా బండేటి చంటి, రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి రాష్ట్రంలోని రాక్షసపాలన అంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాలి ప్రసాద్, ఉప్పాల జగదీష్ బాబు, చోడే వెంకటరత్నం, బివి.రాఘవయ్య చౌదరి పాల్గొన్నారు.

చింతలపూడి : 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకురుతుందని మాజీ ఎంపీ మాగంటి బాబు తెలిపారు. మండలంలో ఎం.హోటల్‌లో నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, టిడిపి మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం బోయగూడెంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, ప్రధాన కార్యదర్శి కోండ్రుదేవా, జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు పాల్గొన్నారు.

టి.నరసాపురం : రాష్ట్ర సర్వతోముఖాభి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రజావేదిక నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామ్మూర్తి, ఆచంట సూర్యనారాయణ పాల్గొన్నారు.

పేరు మార్పు

నేను షేక్ సత్తార్ సాహెబ్, S/o షేక్ చిన మస్తాన్ నివాసం: డోర్ నెం.7-132/3, మెయిన్ రోడ్డు, దుర్గాదేవి గుడి దగ్గర, గరగపర్రు, పాలకొడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా. నా పూర్వపు పేరు (SHAIK SATTAR SAHEB, S/o SHAIK CHINNA MASTAN) నుండి కొత్త పేరు NEW NAME (**SHEIK CHANTI**, **షేక్ చంటి**) గా మార్పు చేయడమైనది. నేటి నుంచి నా పేరును **SHEIK CHANTI S/o SHAIK CHINNA MASTAN** గా పిలవబడును.

NOTICE

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-JUDICIAL MAGISTRATE OF FIRST CLASS; TADEPALLIGUDEM

I.A.No. 57/2020 in **O.S.No. 199/2015**

Between:

1. Gannamani Sriramachand, Rep. by G.P.A. holder G. Atchutaramayya.

...Petitioner/Plaintiff

AND

1. G.Sri Lakshmi and others

...Respondents /Defendants

To,

RESPONDENT NO.7:

7. Vallabhaneni Venkata Vijayalakshmi, W/o. Vallabhaneni Sri Hari, Age: 29, Hindu, Female, Properties, Muddapuram, Tanuku PJCJC.

Please take notice that the above petition I.A.No.57/2020 is filed by the Petitioner/Plaintiff against the respondents/defendants. The matter is posted for the appearance of the above 7th Respondent on Dt. **28-11-2023 from 10.30 A.M.** onwards, on which day you may appear in person or through your advocate and file your objections/pleadings if any. Otherwise the matter will be adjudicated according to law in your absence.

G.SYAMA PRASAD MUKHERJEE,
N. SURYA MANI,
Advocates, Tadepalligudem

Tadepalligudem
Date: 16-11-2023

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

E.P. 5/2023 in **O.S. 107/2016**

బిట్వీన్:

కూనా లక్ష్మిదేవి ...*DHR*

యాదాల శివాజి ...*JDR*

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్తి వేలం ప్రకటన

పై నెంబరు దావాలోని డిక్రీ బాకీకిగానూ JDR తాలూకా యీ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని **ది. 30-11-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితు పై కోర్టులో వేలం వేయబడును. షరతులు తెలుసుకొని పాడుకొనగలరు.

షెడ్యూలు

Residential R.C.C. building Plot No. 24, bearing House No. 7-43-3/1 in possession and enjoyment of the Respondent/ J.Dr in an extent of site admeasuring 254 sq.yards having plinth area in Survey No. 310 situated in Ward No. 13, Block No.43, in Tadepalligudem Town and Municipal Limits, Tadepalligudem Mandal and Sub-Registrary in West Godavari District is within the following boundaries.

EAST: Plot No. 23 - 61.0" site.
SOUTH: Plot No. 22 - 61.0" site.
WEST: Plot No. 25 - 61.0" site.
NORTH: 37.5' - 40 feet wide Road.

Within the above boundaries the above site and R.C.C. building portion with all structures water Tap connection and Electrical Service with all easement rights and drainage sources etc.,

Petitioner's Value: Rs. 10,00,000/-
Amin Value: Rs. 30,00,000/-

GAJULA GOPI KRISHNA
Y.LAKSHMI PRASANNA RANI
Advocates, Tadepalligudem

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

E.A. 79/2023

E.P. 15/2023 in **O.S. 45/2021**

మధ్య:

జల్లి నాగలక్ష్మి, W/o. వెంకటేశ్వరరావు, స్త్రీ, వయస్సు 52, గృహిణి, డోర్ నెం. 14-20-6/1, ఫ్లాట్ నెం. 101, 24వ వార్డు, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. ...*D.H.R.*

Vs

1. ఇంధన నాగేశ్వరరావు, S/o. అప్పారావు, పురుషుడు, వయస్సు 61 సం॥లు, వ్యాపారం, డోర్ నెం. 13-4-15/4, గోటేటివారి వీధి, రామచంద్రరావుపేట, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
2. ఇంధన వెంకట సత్యవతి, W/o. నాగేశ్వరరావు, స్త్రీ, వయస్సు 57 సం॥, గృహిణి, డోర్ నెం. 13-4-15/4, గోటేటివారి వీధి, రామచంద్రరావుపేట, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

...*J.D.R*

D.H.R. తరపున చేసిన స్థిరాస్తి వేలము ప్రకటన

పై నంబరు E.A. 79/2023 in E.P. 15/2023 లో in O.S. 45/2021 డిక్రీ బాకీ రాబట్టుటకు పై కోర్టు వారు యిందలి షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారు ఎదుట **ది. 06-12-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు** వేలం నిర్వహించబడును. సదరు షెడ్యూలు ఆస్తి కొటక్ మహీంద్ర బ్యాంకు తాడేపల్లిగూడెం వార్కి రూ. 18,97,692/- తనఖా బాకీ ఉన్నది. సదరు తనఖా బాకీ లోబడే వేలం నిర్వహించబడును. కావున యావన్మంది వేలంలో పాల్గొని స్థిరాస్తిని పాడుకోవలయును అని తెలియజేయడమైనది.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్, 30వ వార్డు, మున్సిపల్ ఏరియా రామచంద్రారావుపేట, గౌటేటివారి వీధి దగ్గర, డోర్ నెం. 13-4-29 పక్క అసెస్మెంటు నెం. 6/4లో 649 చ॥గ॥లో 170 1/2 చ॥గ॥ నైరుతి మూల డోర్ నెం. 13-4-29/1లో డూప్లెక్స్ బిల్డింగ్ తలుపులు ఎలక్ట్రికల్ సర్వీసు టాప్ కనెక్షన్ వగైరా ఈ క్రింది హద్దులు మధ్య.

తూర్పు: అ. 27.3 కాళ్ల వెంకటరత్నం స్థలం ప్రస్తుతం ఇమ్మంది జయ నాగ వెంకటలక్ష్మి బిల్డింగ్. **దక్షిణం:** అ. 56 మంచాల నాగమణి బిల్డింగ్ ప్రహరీ గోడ. **పడమర:** అ. 27.3 మున్సిపల్ రోడ్డు. **ఉత్తరం:** అ. 56.10 పందిళ్లపల్లి పద్మజ స్థలం బిల్డింగ్‌తో సహా.

పై హద్దుల మధ్య డూప్లెక్స్ బిల్డింగ్ గలదు. యావత్తు తలుపులు, ఎలక్ట్రికల్, టాప్ కనెక్షన్స్ మరియు యావత్తు ఈజుమెంటు హక్కులతో సహాయున్న.

1. అమిన్ వాల్యూ: రూ. 60,00,000/-
2. డి.హెచ్.ఆర్. వాల్యూ: రూ. 25,00,000/-

శిరిగినీడి విజయకృష్ణ
అడ్వకేటు అండ్ నోటరీ
తాడేపల్లిగూడెం అడిషనల్ సి.పి., తాడేపల్లిగూడెం
16-11-2023 సెల్: 9440111251